# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-03-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చింది.**

2. **డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిన్న తీర్మానం ప్రవేశపెట్టారు.**

3. **దేశంలోని 25 వేల కిలోమీటర్ల మేర రెండు లైన్ల జాతీయ రహదారులను నాలుగు లైన్లుగా మారుస్తామని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు నియంత్రించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.**

5. **తెలంగాణాలో పెండింగ్ ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చింది. విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో సహా పలువురు మంత్రులు హాజరయ్యారు. ముస్లింలతో కలిసి చంద్రబాబునాయుడు నమాజ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేదలను ఆర్థికంగా పైకి తీసుకొచ్చేందుకే ఈ నెల 30వ తేదీన పీ4 విధానాన్ని అమలు చేయనున్నామని పేర్కొన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడుతామని ముఖ్యమంత్రి తెలుపుతూ....

**(వాయిస్ 21 సెకన్లు)**

---------------------------

డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిన్న తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలిమిటేషన్ వల్ల జనాభాను నియంత్రించిన రాష్ట్రాలు నష్టపోకూడదనీ ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలనే కొనసాగించాలనీ తెలిపారు. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాలను 153కు పెంచాలనీ ప్రతిపాదించారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్రానికి 36 శాతం పన్నులు కడుతున్నాయనీ కానీ కేంద్రం నుంచి దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధులు వస్తున్నాయనీ రేవంత్ రెడ్డి వెల్లడించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా ప్రభుత్వం పెట్టే తీర్మానానికి పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు.

కాగా తెలంగాణ శాసనసభ నిరవధికంగా వాయిదా పడింది. మొత్తం 11 రోజుల పాటు జరిగిన శాసనసభా సమావేశాలలో 97 గంటల 32 నిమిషాల పాటు సభ కొనసాగింది. 12 బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపినట్లు శాసనసభ వ్యవహారాల శాఖ వెల్లడించింది.

---------------------------

దేశంలోని 25 వేల కిలోమీటర్ల మేర రెండు లైన్ల జాతీయ రహదారులను నాలుగు లైన్లుగా మారుస్తామని కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. 10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఈ పనులు చేపడతామని, తద్వారా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. నిన్న లోక్‌సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. 6లక్షల కోట్ల రూపాయలతో 16వేల కి.మీ జాతీయ రహదారులను ఆరు లైన్లుగా మార్చుతామన్నారు. ఈ విస్తరణ పనులను రెండేళ్లలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు నియంత్రించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని.. ఇందుకు సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. జగ్గయ్యపేట పరిధిలోని 70 గ్రామాల్లో ఏర్పాటు చేసిన 509 సీసీ కెమెరాలను నిన్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, శాసన సభ్యులు శ్రీరాం తాతయ్య, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్యలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నేర నిర్ధారణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపకరిస్తాయని అన్నారు, మహిళల భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యమనీ.. శక్తియాప్ స్వచ్ఛందంగా డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరుతూ...

**( వాయిస్ 26 సెకన్లు )**

---------------------------

తెలంగాణాలో పెండింగ్ ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ములుగు జిల్లా దేవన్నపేట పంపుహౌస్ వద్ద దేవాదుల ప్రాజెక్టు పంపులను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన నిన్న ప్రారంభించారు. అక్కడి నుంచి గోదావరి జలాలు ధర్మసాగర్ జలాశయంలోకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ.. రానున్న 15 రోజుల్లో మరొక మోటార్ ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ ఏడాది చివరికల్లా ప్రాజెక్టు అన్ని దశల పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

---------------------------

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద గ్రామ పంచాయితీలకు ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజక వర్గ పరిధిలోని 18 గ్రామ పంచాయతీలకు మంజూరు చేసిన ట్రాక్టర్లను నిన్న ఆయన అందచేసారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద 2 వేల జనాభా కలిగిన గ్రామ పంచాయితీలకు ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్నట్లు తెలుపుతూ..

**(వాయిస్ 28 సెకన్లు)**

---------------------------

భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ – కాగ్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఇచ్చిన నివేదికను తెలంగాణా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నిన్న శాసనసభకు సమర్పించారు. కాగ్ నివేదిక ప్రకారం 2023–24 బడ్జెట్ అంచనా 2 లక్షల 77 వేల 690 కోట్ల రూపాయలు కాగా వాస్తవ వ్యయం 2 కోట్ల 19 లక్షల 703 కోట్ల రూపాయలుగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఇది అంచనా వేసిన బడ్జెట్‌లో 79 శాతం కాగా, స్థూల రాష్ట్ర, దేశీయ ఉత్పత్తిలో 15 శాతంగా ఉందని అన్నారు. 2023–24 లో ప్రభుత్వం వడ్డీ చెల్లింపుల కోసం 24 వేల 347 కోట్ల రూపాయలు, జీతాల కోసం 26 వేల 981 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు భట్టి విక్రమార్క వివరించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈ నెల 30వ తేది ఆదివారం ప్రసారం అవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిర్మాణంలో ఉన్న మూడు పోర్టులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు కార్యాలయంలో నిన్న ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి దశలో చేపట్టిన నాలుగు ఫిషింగ్ హార్బర్‌లు, రెండో దశలో తక్కువ ఖర్చుతో చేపట్టబోయే ఐదు ఫిషింగ్ హార్బర్ల విషయంలో చేపట్టవలసిన కార్యాచరణపై మంత్రి చర్చించారు. సమావేశంలో మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అత్యాధునిక ఎంఎస్ఎంఈ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి జితిన్‌రామ్‌మాంజీని రాష్ట్ర ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రి కార్యాలయంలో నిన్న ఆయన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. అదే విధంగా స్త్రీనిధి బ్యాంకు ద్వారా ఇచ్చే రుణాలపై వడ్డీ రాయితీ కల్పించాలని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కూడా మంత్రి వినతిపత్రం అందజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాలలో భాగంగా నిన్న భ్రమరాంబికా దేవి మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అమ్మవారికి,ఇ స్వామివారికి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఈరోజు రాత్రి శ్రీ భ్రమరాంబికా దేవి మహాదుర్గ అలంకారంలో దర్శనం ఇవ్వనుండగా కైలాస వాహనసేవపై ఊరేగింపు నిర్వహించనున్నారు.

=====================